

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## కుందనపు బొమ్మ

**"ఒరేయ్ వేణు ఎక్కడ చచ్చావురా?** బస్సుకూడా వచ్చేసింది. నన్ను పెళ్ళి కూడా ప్రశాంతంగా చేసుకోనీవా?" ఫోన్‌లో అరిచాడు శీను.

"ఇక్కడే ఉన్నారా. నీ పెళ్ళి ప్రయాణం బేనర్‌ని కట్టడానికి బస్ క్లీనర్‌కి, డ్రైవర్‌కి హెల్ప్ చేస్తున్నా. హాయిగా అమ్మాయితో మాట్లాడుకోక ఎందుకు ఈ అరుపులు కేకలు?" వేణు సమాధానం ఇచ్చాడు.

"బయటదాకా వచ్చిన వెధవ్వి ఇంట్లోకి వచ్చి మొహం చూపించి పోవచ్చు కదా? టిఫిన్ తిన్నావా?" శీను ఆప్యాయంగా అడిగాడు.

"ఆహా. శుభ్రంగా తిన్నా. సరే డిస్టర్బ్ చేయకు బేనర్ వంకర వస్తుంది" వేణు ఫోన్ పెట్టేసాడు.

మరో గంటలో పెళ్ళివారి బస్సు నెమ్మదిగా బయలుదేరింది. బస్సంతా బంధుమిత్రులతో కళకళలాడుతోంది. రకరకాల వయసుల వాళ్ళు, రకరకాల వస్త్రధారణలు, అత్తర్లు, పూలవాసనలు...

ఆరో వరసలో పెళ్ళికొడుకు పక్కన కూర్చుని కబుర్లు చెప్తున్న వేణు ఎడమవైపు వరసలో ముందు సీట్లో కూర్చున్న అమ్మాయిని చూసి ఆగిపోయాడు. అందానికే అందంగా ఉంది. పక్కనే ఉన్న శీను చెల్లెలితో ఏదో మాట్లాడుతోంది. ఆమె చెవులకి ఉన్న పెద్ద బుట్టలు గంటల్లా ఉండి, ఆమె తలతిప్పడానికి అనుగుణంగా చెంపలకి తాకుతున్నాయి.

"అయ్యో చెంపలు కందిపోతాయేమో అంత పెద్ద బుట్టలు పెట్టింది. కొంచెం చిన్న బుట్టలు పెట్టుకోవాల్సింది" అనుకున్నాడు.

ఉన్నట్లుండి వేణు మౌనం వహించడంతో అడిగాడు శీను.

"ఏంట్రా ఆగిపోయావ్. చెప్పు"

"ఒరే శీనూ చెల్లాయ్ పక్కన కూర్చున్న ఆ అమ్మాయి ఎవర్రా?"

"ఆమె రమ. నీకు తెలుసుగా?"

"అటు కిటికీ వైపు కూర్చున్నమ్మాయికాదు. ఇటువైపు చివర కూర్చున్నమ్మాయి."

"కుందన. డిగ్రీలో చెల్లి క్లాస్‌మేట్."

"కుందన అబ్బా! ఎంత కరెక్ట్ పేరు పెట్టార్రా! వాళ్ళ అమ్మా నాన్నలకి జోహార్లు"

"వాళ్ళు బతికే ఉన్నారనుకుంటారా" శీను నవ్వాడు.

"అవును ఒక్కసారి కూడా మీ ఇంటికి రాలేదేరా చెల్లాయితో?" అనుమానంగా అడిగాడు వేణు.

"వస్తూనే ఉంటుంది. నువ్వు వచ్చినప్పుడు రాలేదేమో. ఇంతకీ ఆ అమ్మాయి మీద అంత ఇంట్రెస్ట్ ఏంటిరా?"

"ఒరే శీను కుందన నాకు భలేనచ్చిందిరా. ఒప్పుకుంటే పెళ్ళి చేసుకుంటారా. చెల్లాయితో చెప్పి రికమెండ్ చేయమనరా" బతిమలాడు.

"ఏంటి? పెళ్ళా! ఒరేయ్ లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటే ఏంటో ఇప్పుడే చూస్తున్నా. ఆ అమ్మాయి ఎవరో ఏమిటో ఏ కులమో, ఏ మతమో, ఆల్‌రెడీ పెళ్ళయిందా లేక ఫిక్సయిందా ఏదీ తెలుసుకోకుండా పెళ్ళేంటిరా?" శీను చిరాకుపడ్డాడు.

"బాబ్బాబూ నాకు కులం, మతం, ఆస్థులు, అంతస్థులు పట్టింపులు లేవు. ఆ అమ్మాయి ఓకే అంటే చాలు. చెల్లాయికి చెప్పరా"

"నీకు పట్టింపులు లేకపోతే వాళ్ళకి ఉంటాయిగా? ఐనా పెళ్ళయిందేమో కూడా. ఆల్‌రెడీ."

"లేదు. కాలేదు"

"అంత ఖచ్చితంగా ఎలా చెప్తావురా?"

"పెళ్ళయితే అలాంటి కుందనపు బొమ్మని ఏ భర్త వంటరిగా పంపుతాడురా? కూడా వాడూ వచ్చేవాడు."

"సరే. సరే. తెలివి తెల్లారినట్లే ఉంది కానీ నువ్వు ఆ అమ్మాయిని చూసుకుంటూ ఉండు. నేను నా డార్లింగ్‌తో ఛాట్ చేసుకుంటా." శీను ఫోన్‌లోకి మొహం దూర్చేసాడు.

వేణు ఆనందంగా ఆ అమ్మాయిని చూస్తూ ఒక కునుకు తీసాడు.

బస్సు బయలుదేరిన రెండు గంటలకి శీను పిన్ని, శీను చెల్లెల్ని పిలిచి ఏదో చెప్పింది. శీను చెల్లెలు, కుందన లేచి ఆవిడ దగ్గరకి వెళితే, ఆవిడ వాళ్ళకి రెండు టిఫిన్లు, పేపర్ ప్లేట్స్ ఇచ్చింది. వాళ్ళు బస్సులోని అందరికీ వాటిలో స్వీట్, హాట్ ఇవ్వసాగారు. ఆ గొడవకి వేణుకి మెలుకువ వచ్చింది. వాళ్ళ దగ్గరకి వచ్చిన కుందన చెరో పేపర్ ప్లేట్ ఇస్తే, శీను చెల్లెలు ఒక లడ్డూ, ఒక సమోసా ఆ ప్లేట్‌లో పెట్టింది. రమ అందరికీ వాటర్ బాటిల్స్ ఇస్తోంది.

"చెల్లాయ్. ఇంకో లడ్డు." కుందన దృష్టిని ఆకర్షించడానికి అడిగాడు వేణు.

అనుకున్నట్లే ఆమె అతన్ని చూసి నవ్వింది.

"అబ్బ! క్లోజప్‌లో కుందన ఎంత బావుందిరా! ఎంత మంచి పలువరసో!!" తన్మయత్వంగా చెప్పాడు.

"నాకు ఆ అమ్మాయి ఓకేలాగా ఉంది కానీ, నువ్వు చెప్పినంత అప్సరసలా లేదే?" శీను సాలోచనగా అన్నాడు.

"అది ఉత్తమ పురుష లక్షణం. నీ భార్య తప్పించి పరాయి స్త్రీలందరూ నీకు ఓకేగానే ఉండాలి. ఒరే శీనూ ప్లీజ్‌రా చెల్లాయికి చెప్పి.."

"సరే. సరే. ఇక చంపకు చెప్తానన్నాగా" శీను విసుక్కున్నాడు.

రెండో వరసలో కూర్చున్న శీను బాబాయ్ వాళ్ళ దగ్గరకి వచ్చి చెప్పాడు.

"వేణూ నువ్వు నా సీట్లో కూర్చుంటావా కొంచెం సేపు? శీనుతో మాట్లాడాలి" వేణు ఆనందంగా లేచి కుందన వెనక సీట్లో కూర్చున్నాడు.

తినడం ముగించిన కుందన మంచినీళ్ళు తాగుతూ తనవంకే చూస్తున్న వేణుని గమనించి శీను చెల్లెలిని అడిగింది

"ఏంటీ? ఈ లడ్డూగాడు మన వెనక్కి వచ్చాడు?"

గుర్తింపుకోసం లడ్డు అడిగినందుకు వేణు తనని తాను తిట్టుకున్నాడు.

"ఛీ ఊరుకో. బాబాయ్ అన్నయ్యతో ఏదో మాట్లాడాలని వేణు అన్నయ్యని ముందుకి పంపాడు" శీను చెల్లెలు మందలించింది.

"అన్నట్లు సునంద దాని లవర్‌కి బ్రేకప్ చెప్పింది తెలుసా?" కుందన చెవి బుట్టలు చెంపలకి తాకుతూండగా అడిగింది.

"అవునా? నాకు తెలీదే?" శీను చెల్లెలు ఆశ్చర్యపోయింది.

"ఇదేమో ఐ ఫోన్ సిక్స్ ఎస్ అడిగిందట. ఆడేమో నోకియా కొనిచ్చాట్ట. ఇంత పీసుగాడివి నీతో నాకేంటి దొబ్బెయ్ అందిట."

ఆ భాషకి అదిరిపోయాడు వేణు.

"అయ్యో! మేడ్ ఫర్ ఈచదర్‌లా ఉండేవాళ్ళు" శీను చెల్లెలు బాధగా చెప్పింది.

"ఈ కుందన నోరు తెరిస్తే అబద్ధాలే. వాళ్ళు హాయిగా కలిసే ఉన్నారు. ఇంకా ఇంటికి వచ్చేప్పుడు బైక్ మీద వెళ్తూ కనిపించారు. నన్ను చూసి ఆగి పలకరించారు కూడా. సినిమాకి వెళ్తున్నారట" రమ చెప్పింది.

"నువ్వు మూసుకుని కూర్చో. నా జోలికొచ్చావంటే నేనసలే మంచిదాన్ని కాదు" కుందన మొహం వికృతంగా మార్చి అరిచింది.

రమ మొహం మాడ్చుకుని కిటికీలోంచి బయటకి చూడసాగింది.

"మా ఎదురింట్లో వాడి గురించి చెప్పానే నీకు?" కుందన అడిగింది.

"ఎవరూ? ఆ మార్గదర్శిలో చేసే అబ్బాయా?" శీను చెల్లెలు అడిగింది.

"అవును. నా వెనక సొల్లు కార్చుకుంటూ తిరుగుతూంటే, నీ మొహానికి నేను చాలా ఎక్కువ ఇంకోసారి నావంక చూసావంటే కుమ్మేస్తా అని చెప్పా." కుందన నవ్వుతూ చెప్పింది.

"నువ్వు నోరు తెరిస్తే బూతులే" రమ విసుక్కుంది.

"నీయమ్మ నువ్వు నోరు తెరిచావంటే గుద్దుతా. చస్తావ్" పిడికిలి బిగించి అరిచింది కుందన.

"ఏంటి గోల?" రెండు సీట్ల వెనక కూర్చున్న శీను అమ్మమ్మ అడిగింది.

"ఏం లేదు అమ్మమ్మ. సినిమా స్టోరీ చెప్పుకుంటున్నాం" శీను చెల్లెలు చెప్పింది.

"ఈ ముసలోళ్ళకి అన్నీ కావాలి. అసలు ఓ మూల పడుండక ఎందుకు వస్తారో. వస్తే వచ్చారు. అన్నీ ఆరాలు." కుందన విసుక్కుంది.

"ష్! మా అమ్మమ్మని ఏమీ అనొద్దు. ఆవిడంటే మాకు ప్రాణం" శీను చెల్లెలు చెప్పింది.

"మా నాయనమ్మ ఏం సతాయించేదో ముసలిము... అది చస్తే నేనూ, మా అమ్మ పండగ చేసుకున్నాం" కుందన కసిగా చెప్పింది.

వేణు చూపు మరల్చుకుని కిటికీలోంచి చూడసాగాడు.

"అవును మన వెనక కూర్చున్న లడ్డూగాడికి ఏమాత్రం ఉందేంటి? పటాయిస్తే పడేట్లున్నాడు గురుడు" అడిగింది.

"వేణు అన్నయ్య పేరెంట్స్ బాగా రిచ్. అన్న కూడా ఏదో మంచి జాబ్ చేస్తాడు" శీను చెల్లెలు చెప్పింది.

"ఐతే నాకు పరిచయం చేయవే ప్లీజ్. ఒక డైమండ్ నెక్లెస్ కొనిపిచ్చుకోవాలి, అని ఎంతకాలంగానో కోరికగా ఉంది" కుందన బతిమాలింది.

"కొనిపిచ్చుకోవాలి అనే కోరిక ఏమిటి? కొనుక్కోవాలి అనుకోవాలి కానీ?" రమ వెటకారంగా అడిగింది.

"నీ యబ్బ నోరెత్తద్దన్నానా? నీలాంటి వాళ్ళు కొనుక్కోవాలి. ఇక్కడ కుందన, చిటికేస్తే ఇట్లాంటి లడ్డూగాళ్ళు నా చుట్టూ కుక్కపిల్లల్లా తిరుగుతారు." కుందన గర్వంగా చెప్పింది.

వేణు లేచి వెనక్కి వెళ్ళి చివరి సీట్లో పెట్టిన మూటలు, సంచిలని సర్ది చోటు చేసుకుని కూర్చున్నాడు. అతను ఇక కుందన గురించి ఆలోచించదల్చుకోలేదు. రుద్రవీణలో చిరంజీవిలా రెండుసార్లు మాత్రం "అంత అందమైన రూపమేంటి? ఆ వికృతమైన మనసేంటి?", "అంత అందమైన రూపమేంటి? ఆ భాషేంటి?" అని మాత్రం అనుకున్నాడు.

బస్సు దిగాక శీను తన పక్కనుంచి వెళ్తున్న చెల్లెల్ని చూసి పిలిచాడు.

"చెల్లాయ్! మన వేణు..."

"వద్దురా ఏదో సరదాగా అన్నాను. నీలాగా నేను కూడా అమ్మా నాన్న చూసిన అమ్మాయినే చేసుకుంటాను" వేణు వారించాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story